# 43. తనవంక నెలవంక

సుబ్బయ్యకి మతి పోయింది. నాలుగు దశాబ్దాలై కాపరం చేస్తోంది తనతో.

మాటవరసకైనా ఏ ముఖ్య విషయంలోనూ తనని కాదని ఎరగదు. ఇవాళ ఎదొరాడ్డమేకాదు, చెప్పా పెట్టకుండా ఇల్లే దాటేసింది! పైగా వంటమనిషి ద్వారానా సందేశం!

"ఇవిగో అమ్మగారు మీకీ తాళాలిమ్మన్నారు, మళ్ళీ మిమ్మల్ని నిద్రలేపడమెందుకని నాతో చెప్పి వెళ్ళిపోయారు...... బాగా తెల్లారితే మొదటిబస్సు అందదని పాలేర్ని తీసుకుని హడావుడిగా వెళ్ళిపోయారు. అయ్యో, అదేమిటి బాబాగారు, కప్పులో కాఫీ అలాగే ఉంచేశారు, ఈ పాటికి చల్లారిపోయే ఉంటుంది. మరో కప్పు కలిపి తెమ్మంటారా!"

"ఇదిగో రవణమ్మా, ముందిక్కడి నుంచి తక్షణం దయచెయ్యి"

"అయ్యోబాబూ, మధ్య నన్ను కసురుకుంటారేమిటి అమ్మగారొచ్చేదాకా మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకోబోతే వచ్చాక ఆవిడ నన్ను బతకనిస్తుందా?"

"ఆవిడ తిరిగొచ్చేదాకా నేను బతకాలి కద. కాబట్టి నన్ను కాస్సేపు నిశ్శబ్దంగా బతకనియ్యి...... వెళ్ళి నీ పనిచూసుకో........ ఇప్పట్లో ఇటురాకు, తెలిసిందా, నేను పిలిచినా సరే."

'మీరూ మీరూ బాగానే ఉంటారు. మధ్యని జీతగాళ్ళం మా మీద లేస్తారెందుకు!' అని విసుక్కుంటూ అయిష్టంగా నెమ్మదిగా వంటమనిషి అక్కణ్ణుంచి కదిలింది.

చుట్ట అంటించి కిటికీ తలుపు తెరిచాడు. రంగరాజుమనవడు వీధిచివర్న తనింటికి వస్తూ కనిపించాడు. రంగరాజు తన చిరకాల మిత్రుడు. తెల్లారి తన అరుగుమీద చేరి ఇద్దరూ కలిసి ఓ గంట కబుర్లు చెప్పుకుంటేగాని ఆ రోజు తెల్లారినట్టు ఉండదు. ఇంకో సమయంలో అయితే ఇంకా వాడు రాలేదేం అనిపించేది. పెళ్ళాంగారు చేసిన ఘనకార్యంకి తట్టుకోలేక పోతోంది మనసు. అసలే ఆ రంగరాజుగాడు దరువులకి గురువు. వాడొస్తే ఇంకేమైనా ఉందా!

'ఇదిగో రవణమ్మా రవణమ్మోయ్' చటుక్కున కిటికీతలుపులు మూసేస్తూ పిలిచాడు. ఆవిడ పక్కనున్న వరండా దాటనే లేదు. నాలుగుసార్లు పిలిచినా ఇటు తిరగలేదు. గట్టిగా అరిచాడు.

"పిలిచినా పలకొద్దు అని ఇప్పుడేగా శెలవిచ్చారు?' అంది అటే చూస్తూ.

"మా కర్మా నీ కర్మాకాలి మా ఇంట్లో వంటకి కుదురుకున్నావు గాని ఏ లేబర్ యూనియన్ లీడర్‌గానో ఉండవలసిన దానివి. ఎరక్కపోయి అలా అన్నాను. కాని, చిన్న ఉపకారం చేసిపెట్టు. నేను లేచానో లేదో కనుక్కురావడానికి కాబోలు అప్పుడే ఆ రంగరాజు గుండుగాణ్ణి పంపించినట్టున్నాడు..... ఇప్పుడుగాని ఆ రంగరాజు దిగబడితే రేవు పెట్టేస్తాడు. నేనింకా లేవలేదనిచెప్పి వెంటనే పంపెయ్యి ఇంకా నిలబడతావేం?"

"ప్రొద్దుటే లేచి చూసి చూసి ఇంత పచ్చి అబద్దం ఎలా చెప్పనని! పనిమనుషులమైనా

మేమూ మనుషులమేబాబుగారూ!''

రవణమ్మ మాట పూర్తి కాకుండా పెద్దచప్పుడుతో తనగది తలుపులు లోపలికి వేసుకుని ఉస్సురని పడక్కుర్చీలో కూచున్నాడు. కొడుకు ఉత్తరం గుర్తుతెచ్చుకున్నాడు: "ఇంత పెద్ద ఉద్యోగం వదులుకుని ఈ పట్నం నుంచి ఆ పల్లెటూరు వచ్చి ఇప్పుడు నే నేంచెయ్యనే? ఈ ముసలి కాలంలో యింకా ఏం చాకిరీ చేస్తారే, అవన్నీ అమ్మి పారేసి నువ్వూ నాన్నా మా దగ్గరకి వచ్చెయ్యండే అమ్మా' అని యిప్పటికి ఎన్నిసార్లు రాసి ఉంటాడో!

ఈ రెండు మూడేళ్ళలో యిక్కడ బాగా అలవాటైపోయింది. తనకేకాదు, బుచ్చెమ్మకికూడా. తన ఉద్యోగపు బదిలీలలో తిరిగి తిరిగి ఇప్పటిదాకా ఉన్న ఊరూ సొంత కొంపా అంటూ చేరుకున్నారు. మళ్ళీ ఈ వయసులో కుర్రాడితోపాటు ట్రాన్స్ఫర్లంటూ ఎక్కడ తిరిగేది!

మనవడి ముద్దు ముచ్చట్లతో గడిపే అదృష్టం తమకి ఉండొద్దూ?

"ఏం రా తలుపు తీస్తావా, విరి చెయ్యనా!''

రంగరాజు పెనుకేకతో మళ్ళీ వర్తమానంలోకి వచ్చాడు సుబ్బయ్య, లేచి నీరసంగా వెళ్ళి తలుపు తీశాడు.

"అమ్మగారు ఊరి పొలిమేర దాటి రెండు గంటలయిందో లేదో ఎలా తయారయిందిరా నాయనా అయ్యగారి అవతారం! ఇంటెడు బాధ్యతా వదినగారు ఒక్కచేతి మీద లాగిస్తూంటే పాపం చీమకుట్టినట్లుండేదికాదు. చుట్టమీద చుట్ట తగలెయ్యడం తప్ప చేతిలో పనీ ఉండేదికాదు...... ఇంతకీ ఇప్పుడేం ముంచు కొచ్చిందని ఉన్నట్టుండి అలా చుంచులా కొరకంచులా తయారయ్యావ్?''

"బాబూ, సమ్మెట స్రామాట్! వెడుదూ, నన్ను చంపక"

"అదే పని మీద వచ్చిన నేను ఆ పని పూర్తి కాకుండా ఎలా వెడతాను, ముందా కుర్చీ మీంచిలే'' అంటూ అప్రయత్నంగా సుబ్బయ్య లేచాడో లేదో, దాన్ని ఆక్రమించి, చుట్ట ముట్టించి, కాళ్ళు ఆడిస్తూ "ముందా తలుపు గడియ వేసిరా'' అని పురమాయించాడు రంగరాజు. "అదేమో చెప్పాపెట్టకుండా చెక్కేసింది. నువ్వేమో తలుపు గడియెట్టి అగ్గెట్టు. అంతేగదా మీరు చెయ్యగలిగింది! ఒరే రంగరాజుగా, ఉత్తప్పుడైతే నేనేం అడ్డుకున్నానా, సరిగ్గా యిలా పీకలు తెగిపోయే టైములోనే వెళ్ళి పోవాలా? మళ్ళీ వచ్చేదికాదే, ఇవాళ జరిగే మీటింగు! వాళ్ళకి రేప్పొద్దున ఏ మొహం పెట్టుకు జవాబు చెప్పేది?' అంటూ చిందులు తొక్కేశాడు సుబ్బయ్య.

ఆరిన చుట్టని ముని పంటితో కొరుకుతూ రంగరాజు ఆలోచించాడు.

ఒకొక్కప్పుడు పరిస్థితులు యిలాగే వచ్చి మనుషుల్ని ఓ ఆట ఆడిస్తాయి. ఆ మంగళవారం మధ్యాహ్నం మూడున్నరకి బుచ్చెమ్మ అన్న భానోజీ పెద్దమనుమరాలి పెళ్ళి. బాగా ముందుగానే రాశాడుట కొడుకు తల్లిని కూడా తప్పకుండా రమ్మని.

"ఏదో వంకపెట్టి ఎప్పట్లా ఉండిపోయావు సుమీ అమ్మా, ఈ సారి నాకు కాదు, నీ పేరింటిగాడు

నీ మనవడికి జవాబు చెప్పుకోవాలి. ఇక్కడికొచ్చేస్తె అందరం సరదాగా కలిసివెడదాం. మనకో వంశాంకురం అంటూ లేదని తాతయ్యా వాళ్ళూ నిన్ను అడ్డమైన మాటలూ అన్నారని ఏడ్చుకునేదానివి. వీణ్ణి వెంటపెట్టుకుని నలుగుర్లోకి వెడితే బుద్ధి చెప్పినట్టు అవుతుంది. ఇదే అదను. వెంటనేరా"

అయితే సరిగ్గా అదే సమయానికి, అంటే మంగళవారం సాయంకాలం, సుబ్బయ్య తప్పకుండా ఎటండ్ కావలసిన మీటింగు ఒకటుంది. విజయవాడలో వివిధ రంగాలలో కృషిచేసిన పదిమంది వృద్ధులకు విశిష్ఠ సేవాపతకాలు ప్రకటించింది ప్రభుత్వం. అందులో సుబ్బయ్యపేరు కూడా ఉంది. ఎమ్మెల్యే ముఖ్య అతిథి. ఇందుకోసం ఉపరాష్ట్రపతి ఢిల్లీనుంచి వస్తున్నారు, పతకాలు వారి చేత్తో యివ్వడానికి. ఎప్పుడో నూటికీ కోటికీ వస్తాయి, ఇలాంటి అవకాశాలు.

ఇంటినిండా ధాన్యం. దొంగలబెడద చాలా ఎక్కువగా ఉన్నరోజులు. ఇల్లు కదలడానికి లేదు. మాటాడుతూ నిద్రలోకి జారిపోయే రంగరాజు లాంటి వాళ్ళకి అప్పచెప్పే పరిస్థితి కాదు.

ఎవరో ఒకరు ఇంటిపట్టున ఉండితీరాలి. సుబ్బయ్యో, బుచ్చెమ్మో!

"నువ్వెళ్ళకపోతే చిట్టిపెళ్ళి ఆగిపోదు లేవే....... నే నెలాగా వెళ్ళక తప్పదు. ఏం వింటున్నావుగా?" అని సుబ్బయ్య ముందుగానే హెచ్చరించాడుట. అవునూ కాదూ అనకపోతే ఏమనుకుంటారు ఎవరైనా? రేపుపెళ్ళంటే ఇవాళదాకా కదల్లేదంటే ఎంత ఉత్తమురాలో అని పొంగిపోయాడట. రెండు పెద్ద ట్రంకులనిండా స్వీట్సుతో పాలేరుని వెంటపెట్టుకుని మొదటిబస్సు అందుకుంటుందని ఎవరనుకున్నారు! "నువ్వు చెబితే నమ్మవు, జీవితంలో లంక పొగాకు చుట్ట నాలుగు పీల్పులుపీల్చి వదుల్తొంటే ఇంతకుమించిన చుట్టరికం ఎక్కడుందనిపించింది. "సిగరెట్టుతాగడం ఆరోగ్యానికి హానికరం అనేది చట్టబద్ధమైన హెచ్చరిక. 'పొగచుట్ట తాగడం ఆంతర్యానికి హాయికరం" అనేది 'చుట్ట' బద్ధమైన హెచ్చరిక అయిఉండాలి!"

అలా గుప్పు గుప్పున పొగలువదులుతూ ఉంటే ఎన్నెన్ని రకాల ఆలోచనలయినా రగులుతూ ఉంటాయి అతనిలో.

తను రిటైరు అయి స్వగ్రామంలోని సొంత భవంతిని చేరుకున్నాక మరీ ఒంటరి జంట అయిపోయారు తనూ బుచ్చెమ్మా! ఊరివాళ్ళు మంచి వాళ్ళు కాబట్టి, మొదట్నుంచీ తను ఆస్తిచూస్తున్న పిల్లలులేని, మేనత్తా మొగుడూ ఏ స్వార్థమూ లేకుండా అన్నీ నిర్వహించబట్టి, పైసా పొల్లుపోకుండా అంతా చేతికొచ్చింది. అందుకే తీర్థయాత్రలకి వెళతామంటే పదివేలిచ్చి వాళ్ళని పంపించాడు. ఈ రోజుల్లో అలాంటి ఉత్తములు ఉండరు. ఎంతిచ్చినా తప్పులేదు అలాంటివాళ్ళకి. ఇంకా ఉండమంటే ఉన్నారు కాదుమరి.

ఇక అంతబాధ్యతా, ఈ రెండుమూడేళ్ళలో బుచ్చెమ్మే, ఒంటిచేత్తో నిర్వహించుతూ వస్తోంది. బస్తాలకొద్దీ ధాన్యమిచ్చే పొలాలు, లీటర్లకొద్దీ పాలిచ్చే జెర్సీ ఆవులు. ఇలాంటి సిరి సంపదలు వయసుమళ్ళిన కాలంలో ఇచ్చే సుఖంకన్న, కలుగజేసే అలసటే ఎక్కువ. తినే యజమానులు యిద్దరే

కాని యింట్లో ఉండి చాకిరీచేసి తినే నౌకర్లూ చాకర్లూ బండెడుమంది. ఒకరి పనికంటె అందరి పని అజమాయిషీ ఎప్పుడూ కష్టమే. ఏ వేళకి దేనికది అమర్చడమనేది మాటలతో అయ్యేపనికాదు. నెత్తురువేడి ఉన్న పిల్లలు యిలాంటి బాధ్యత చేతికి తీసుకుని పెద్దవాళ్ళకింత విశ్రాంతి ప్రసాదించే అదృష్టానికి మాత్రం ఆ కొంప నోచుకోలేదు. ఏ కొంపయినా ఇంతేనేమో!

మొదటి ముగ్గురూ కూతుళ్ళు. పెద్దమ్మాయిలిద్దరూ పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న భర్తలతో, అక్కడ ఇళ్ళుకూడా కొనుక్కుని, విదేశాలలో స్థిరపడిపోయారు. మూడోది దేశంలోనే ఉంది. అదేజిల్లా కూడా. అంతేకాదు. అందరికంటె ఆస్తిపరులు వాళ్ళ వాళ్ళు. పెళ్ళై పదేళ్ళయినా దాని కడుపుపండలేదు. ఆ ఇంటికి పెద్ద కోడలు తనే. పూటకి పాతిక విస్తరిలేచే సమిష్టికుటుంబానికి తలలో నాలిక అదే. ఊపిరి తీసుకోడానికే ఉండదు దానికి సమయం. ఏ రెండేళ్ళకో ఓసారి ఓ పూట పుట్టింటికి రావడమే గగనం.

పిల్లల్ని కంటారుగాని వాళ్ళ అదృష్టాల్ని కనలేరు గదా!

ఆఖరి సంతానం అబ్బాయి, తనని ఎంతో ప్రాధేయపడి ఒప్పించి వాళ్ళనాన్న వెంకట్రావు పేరు పెట్టుకుంది బుచ్చెమ్మ. దానికి తగ్గట్టే తల్లి అంటే పంచప్రాణాలు వాడికి. ఓ కలవారి అమ్మాయి కలికికామాక్షిని వెంకట్రావుకిచ్చి ఘనంగా పెళ్ళి చేశారు.

వాడిక్కూడా అదేం కర్మో ఓ పట్టాన పిల్లలు పుట్టలేదు!

తమ ఆస్తిపాస్తులుచూసి మొదట్నుంచీ కన్నెర్ర చేసుకున్న బంధువులందరూ మా బాగా అయిందన్నారు. ముఖ్యంగా పుట్టింటివారి సూటీ పోటీ మాటలు పడలేక బుచ్చెమ్మ పిచ్చెత్తిపోయింది. "దగ్గిర సంబంధాల్ని కాదని, డబ్బుకి ఆశపడి, ఎత్తెత్తి అడుగేస్తే ఏమవుతుంది మరి? గొడ్డుకోడలు దొరికిందంటే దొరకదా? అని 'వేటాడి' పోసుకున్నారు.

బుచ్చెమ్మ మనసుకి భూదేవి చాలదు. పదిమంది ఉన్న కొంపలోంచి వచ్చింది ఆవిడ.

ఇల్లంటే, మెయిలొచ్చే వేళ రైల్వేప్లాట్ ఫారంలా ఉండాలని ఆవిడ విశ్వాసం. పదిమందితో పంచుకుంటేగాని బతుకు కాదని ఆవిడ విశ్వాసం.

వెర్రిచాకిరీలో పడి అలసిపోయి, మొద్దునిద్రకి లోనై ఎలాగో రోజులు దొర్లిస్తోందిగాని క్రోటన్సుమొక్కలా ఎన్ని రంగులూ హంగులూ ఉంటే ఏంలాభం, పిల్లలు లేకపోయాక!

కామాక్షిచేత మొక్కించని దేవుడూ చేయించని వ్రతమూ లేదు. డివైన్ స్పెషలిస్టెవరూ వరాలివ్వలేదుగాని ఓ గైనిక్ స్పెషలిస్ట్ వివరాలిచ్చింది.

కామాక్షి యూట్రెస్‌లో ఏదో లోపం ఉందిట. ప్రత్యేకించి ఏవో ఫారెన్ ఇంజక్షన్లున్నాయంటే తెప్పించి ఇప్పించింది. ఎందుకైనా మంచిదని కొడుక్కి కూడా కాప్సూల్స్ చెబితే వేయించింది. ఎలాగైతేనేం బుచ్చెమ్మ కలలుపండి కోడలు నీళ్ళోసుకుంది. అయిపోయిందా, ఆ అమ్మాయికి నెలనెలా గండమే. పూర్తిబెడ్‌రెస్టు తీసుకోవాలి.

తల్లిలేని కోడలని, వెంటనేవెళ్ళి కన్న తల్లికంటే ఎక్కువగా ఆదుకుంది. "ఆ కోడలేం మోసింది. నవమాసాలూ మోసింది అత్తగారే. ఇంతకీ తల్లి బతికున్నా అంతలాచేసి ఉండదేమో" అనేవారు. అంత వయసులో ఆస్పత్రిమెట్లు దిగలేక ఆయాసపడుతున్న ఆవిణ్ణిచూసి "ఎన్ని పాట్లు పడితేనేం పండంటి మనవణ్ణి అందుకుంది బుచ్చెమ్మ. అయితే నేం అందరూ ఓ చోటుండే అదృష్టం ఉండొద్దా?

"ఎప్పుడూ యిలా చేసి ఎరగదు మీ వదిన. ఆవిణ్ణి అటువైపు లాగిన శక్తి ఏమిటా అని!" "అడిగావు కదూ, అడిగావంటే ఇంకా తెలుసుకోవాలనే స్టేజీ దాటిపోలేదన్నమాట. నీకు తెలీదని కాదు గాని పై వాణ్ణి గనక నాకు మరింత స్పష్టంగా కనబడుతోంది సమాధానం. చెబుతాను విను"

అంటూ ఆరిన చుట్టని జ్యోతిర్మయంచేస్తూ రంగరాజు చెప్పేడు:

"చూడొరే సుబ్బులూ- నేనెప్పుడు లేస్తానా, ఎప్పుడీ పడక్కుర్చీ ఆక్రమిద్దామా అని కొట్టుకుపోతోంది నీ మనసు. నాకు తెలుసు, కాదనకు, అంతలా భూస్థాపితమైపోయిది నీ ప్రయోజకత్వం! ఇన్నేళ్ళబట్టి ఇంచు మించు ప్రతిరోజూ చూస్తున్నాను, పాపం చెమటలు కారుతూ వదినగారు పనివాళ్లతోనో పాలికాపులతోనో పనిచేయించలేక ఇల్లంతా కలియదిరగడం. నువ్వేమో ఉంటే యిక్కడ యీపడక్కుర్చీలోనో లేదా అవతల ఆ అరుగుకి అతుక్కుపోవడం! అవి మరొకరి వల్ల జరగవు గనక పాపం కాలకృత్యాలూ నిద్రా భోజనాలూ ఎలాగో కష్టపడి నువ్వే నిర్వహించుకు వస్తున్నావు. ఇక్కడే కాదు, ఇంచుమించు ఇంటింటా ఇదే కథ. రిటైర్‌మెంటు అనేది మనవాళ్ళలో మగ వాళ్ళకే. ఎన్నేళ్ళొచ్చినా నడుము వంగినా విశ్రాంతి అనేది ఆడాళ్ళకి లేదు! ఇన్నేళ్ళ గానుగ బతుకుతో పాపం ఆవిడ ఒక్కటంటే ఒక్కసారి రిలీఫ్ కోరింది. తీస్తే కునుకో తప్పితే తిండో తప్ప మరొకటి ఎరగని మనమే అదే సమయానికి పోటీకి వస్తే మరెలా జవాబు చెబుతుంది! మనకంటికి మన వ్యవహారం గొప్పదేకావొచ్చు బిరుదు ప్రదానోత్సవాలో "పిరుదు ప్రదానోత్సవా"లో నాకు తెలీదు గాని యీ సేవా పతకాలు నూటికో కోటికోతప్ప కులాలవారీ రాజకీయ ఏర్పాట్లు కాదంటావా? ఇక ఆవిడది? జన్మానికో శివ రాత్రి. పుట్టింటి వారింట్లో పెళ్ళి. అపురూపమైన అవకాశం. అందులో అలా ఇలానా, మనవణ్ణి ఎత్తుకుని! ఎవరికి చూపించాలని? ఇవన్నీ ఉట్టి గాలి మబ్బులని కొట్టిపారేసిన వాళ్ళకి తనవంక నెలవంక చూపించే మహద్భాగ్యం. అసలే బాగా ఒళ్లుగలమనిషి, పట్టుచీరతోపెరిగిపోయిన కైవారం. ఇవిచాలక దుక్కంత మనవడు. ఉత్సాహంతో ఆయాసంతో చంకలోంచి జారిపోతున్న మనవణ్ణి అట్నించి యిటూ, ఇట్నించి అటూ మార్చుకోలేక, ఆపసోపాలు పడుతున్న మామ్మగారి మధుర దృశ్యం కన్న ప్రేమ కావ్యం వుందిట్రా ప్రపంచంలో! ఏదో పదిమంది బుర్రలు కొట్టి మగాళ్ళం మనం ఇంట్లో పడేస్తాం గాని మనకింత ప్రేమ పంచి పెట్టి మనల్ని మనుషులు చేసేది మన ఆడాళ్ళే కద్రా!"

దగ్గిరగా వచ్చి, రంగరాజు వైపు ప్రశంసా పూర్వకంగా చూశాడు సుబ్బయ్య.

★